క్లుప్తంగా

బంగారు హారం బహూకరణ



ఆలయ చైర్మన్‌కు బంగారు హారాన్ని అందజేస్తున్న చల్లా కృష్ణయ్య దంపతులు

బుచ్చిరెడ్డిపాళెం: జొన్నవాడలో కొలువైన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారికి వెంకటాచలం మండలం నిడిం పల్లికి చెందిన చల్లా కృష్ణయ్య, రమణయ్య దంపతులు 15 గ్రాముల బంగారు హారాన్ని శుక్రవారం బహూకరించారు. ఆలయ చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడుకు బంగారు హారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు అర్చకులు దేవదేవేరుల దర్శనం కల్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. దాతలను శేష వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సన్మానం



ముత్తుకూరు: మండలంలోని ఈపూరు వెంకన పాళెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం భట్టారం శ్రీనివాసులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం శ్రీనివాసులు దంపతులను హైస్కూల్లో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ ప్రత్యూష, ఎంఈఓ మధుసూదన, మండలంలోని పలువురు జెడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొని మాట్లాడారు.

నేడు అన్నమయ్య సంకీర్తనావళి

నెల్లూరు(బృందావనం): శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ, శ్రీవాణి శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో శనివారం శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల 614వ జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ ముఖ్య సమన్వయకర్త, లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను శుక్రవారం నెల్లూరు మాగుంటలేఅవుట్‌లోని ఆ పత్రిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్థం, ఆలాపన, అభినయంతో అన్నమయ్య సంకీర్తనావళి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామన్నారు. శనివారం సాయంత్రం 6 గంటలకు మినీబైపాస్‌రోడ్డులోని అన్నమయ్య సర్కిల్‌లోని అన్నమాచార్యుల విగ్రహం వద్ద పూజా కార్యక్రమాలు చేపట్టిన అనంతరం అక్కడి నుంచి పీవీఆర్ కల్యాణ మండపం వరకు నగర సంకీర్తన సాగుతుందన్నారు. శ్వేత మాజీ సంచాలకులు భూమన్ భావ వ్యక్తీకరణ వివరిస్తారన్నారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు కె.సరస్వతీప్రసాదు గానాలాపన, నెల్లూరు శ్రీగురుకృప కళాక్షేత్రం విద్యార్థినుల నాట్యారాధన ఉంటుందని తెలిపారు. అనంతరం తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో కార్య నిర్వాహక సభ్యులు నలుబోలు బలరామయ్యనాయుడు, దండమూడి హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలకు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు సిటీ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఏపీ టిడ్కో గృహ సముదాయాల్లోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి ప్రాంతాల్లో గృహాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వికాస్ మర్మత్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గృహాలు కేటాయించిన లబ్ధిదారులు కొంతమంది మాత్రమే రిజిస్ట్రేషన్‌కు ముందుకొచ్చారని తెలిపారు. గృహాలు తీసుకునేందుకు అయిష్టత చూపిన లబ్ధిదారులకు కేటాయించిన వాటిని రద్దు చేసి కొత్త వారిని ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో టిడ్కో ఈఈ ఉమాశంకర్‌శాస్త్రి, మెప్మా పీడీ రవీంద్ర, పెంచలయ్య, జరీనా తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాల చెరువు పరిశీలన

నెల్లూరు సిటీ: కేంద్ర, రాష్ట్ర సూచనల మేరకు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని స్వర్ణాల చెరువు అభివృద్ధికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ చీఫ్ ఆర్కిటెక్ట్ కిరణ్‌కుమార్, కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులకు సూచించారు. స్వర్ణాల చెరువు వద్ద ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. స్వర్ణాల చెరువు తీరంలో నడకమార్గం, ప్రహరీలు, వ్యర్థాల నుంచి తయారీ చేసిన ఉత్పత్తుల ప్రదర్శన గజిబో, మోరల్ ఆర్ట్స్ తదితర నిర్మాణాల ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు పక్కా ప్రణాళిక

- ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి
- టీపీగూడూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

తోటపల్లిగూడూరు: 'నేరాలను నియంత్రించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. సిబ్బంది ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలి.'అని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంపారిటివ్ క్రైమ్ చార్ట్, స్టేషన్ మ్యాప్, రిసెప్షనిస్ట్ రూమ్, రికార్డులను పరిశీలించారు. అలాగే నమోదు చేసిన ఫిర్యాదుదారుల వివరాలు, సమస్యలను పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అనుమానాస్పద మరణాలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలు, మిస్సింగ్ కేసులపై సిబ్బంది వేగంగా స్పందించాలన్నారు. దొంగతనం కేసులను త్వరగా ఛేదించి సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బీచ్ ప్రాంతంలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, ఆకతాయిలపై నిఘా పెట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ మద్య సేవనంపై డ్రైవ్ నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. నేరాల కట్టడికి రౌడీషీటర్స్, పాత నేరస్తులపై నిఘా ఉంచి తప్పక కౌన్సెలింగ్ ఇవ్వాలని ఆదేశించారు. స్టేషన్ సిబ్బంది యోగక్షేమాలను ఆరాతీశారు. విధుల పట్ల అలసత్వం వహించొద్దని తెలిపారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలను నాటి పరిరక్షించాలని సూచించారు. ఎస్పీ వెంట కృష్ణపట్నం పోర్ట్ ఎస్సై శివకృష్ణారెడ్డి, స్థానిక ఏఎస్సై శివ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సీఐ

ముత్తుకూరు: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని, వీటి వల్ల భవిష్యత్‌కు ముప్పు ఏర్పడుతుందని కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి హెచ్చరించారు. ముత్తుకూరులోని గోపాలపురం అదానీ వరల్డ్ స్కూల్లో మాదక ద్రవ్యాలపై శుక్రవారం ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెడు స్నేహాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు చెప్పారు. ఉన్నత విలువలతో సమాజానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల ఆకాంక్షాలను నెరవేర్చాలన్నారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్యూరిటీ హెడ్ వెంకటేష్ భాస్కర్, ఎస్సైలు శివకృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ప్రిన్సిపల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్‌బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కనుపూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరానికి చెందిన మనోహర్ పని నిమిత్తం బైక్‌పై కనుమూరుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కనుపూరు సమీపంలో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో మనోహర్‌కు గాయాలవగా స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం అతడిని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పొదలకూరు: పట్టణంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లో మరమ్మతులు చేయిస్తున్నందున సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

- ఇందుకూరుపేట: మండలంలోని మైపాడులో ఇండస్ట్రియల్ విద్యుత్ సరఫరాకు శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని నరసాపురం సబ్‌స్టేషన్ ఏఈ నరసింహులు శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

వాటర్ జగ్గుల వితరణ



జగ్గులను అందజేసిన దాతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో ఉన్న మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి సంబంధించి నాలుగు వాటర్ జగ్గులను శుక్రవారం దాతలు వితరణ చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ పుట్టా లక్ష్మీసుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడుతూ నెల్లూరుకు చెందిన చీమకుర్తి లోకేశ్ ఆచార్య, పుష్పలత దంపతులు వాటర్ జగ్గులను బహూకరించారన్నారు. ఈ సందర్భంగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు.

బడి ఈడు పిల్లలపై స్పెషల్ డ్రైవ్



మాట్లాడుతున్న ఎంఈఓ చెంచులక్ష్మి

కోవూరు: బడి ఈడు పిల్లలపై మండలంలోని కోవూరు, ఇనమడుగు గ్రామాల్లో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోవూరు ఎంఈఓ-2 చెంచులక్ష్మి మాట్లాడుతూ పిల్లల్ని బడికి పంపి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థుల నివాసాలకు వెళ్లి చదువు ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అమ్మఒడి తదితర పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిని అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు వనజ, హరీష్, శీను, హేమలత, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీ ఫుడ్ వెరీ టేస్ట్ గురూ..



పులస చేపల కూర స్టాల్

నెల్లూరు నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో 3వ సీ ఫుడ్ ఫెస్టివల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన సందర్శించారు. మంత్రితోపాటు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్ స్టాళ్లను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతల ప్రదర్శన, ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. పలువురు స్టాళ్లలోని ఆహార పదార్థాలను రుచి చూసి 'సీ ఫుడ్ వెరీ టేస్ట్ గురూ.. అంటూ కితాబునిచ్చారు.

– నెల్లూరు(దర్గామిట్ట)



రొయ్యను పరిశీలిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి



చేప భలే ఉందిగా..: సెల్ఫీ దిగుతున్న యువతులు

కలెక్టర్‌ను కలిసిన ఏపీఆర్‌ఎస్‌ఏ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టర్ ఎం.హరినారాయణన్‌ను ఏపీఆర్‌ఎస్‌ఏ నాయకులు శుక్రవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి కలెక్టర్‌కు పలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఆఫీస్ సబార్డినేటర్లకు జూనియర్ అసిస్టెంట్లుగా, వీఆర్‌ఏలకు ఆఫీస్ సబార్డినేట్లుగా పదోన్నతులు కల్పించాలని, డీటీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. సాధ్యమైన త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.డానియేలు పీటర్, పి.మురళి తదితరులు పాల్గొన్నారు.

కేపీసీలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వాణి

నెల్లూరు(టౌన్): స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని కేపీసీ జూనియర్ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన, నిరక్షరాస్యత, వైకల్యం ఉన్న వ్యక్తులకు ఉచిత న్యాయం అందించాలన్న ఉద్దేశంతో 1987లో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటైందని తెలిపారు. అలాగే 1997లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ర్యాగింగ్ నిరోధక చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో పొందుపరిచిన విధివిధానాలను విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, అధ్యాపకులు, కళాశాల యాజమాన్యాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ర్యాగింగ్ ద్వారా అవమానించడం, బాధించడం జరిగితే ఆరునెలల జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, లక్ష్మీప్రసాద్, డాక్టర్ భాస్కర్, ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వామ్మో ట్రాఫిక్..!



పంచాయతీ బస్టాండ్‌లో స్తంభించిన ట్రాఫిక్



బజారు రోడ్డులో అడ్డంగా నిలిపిన ఆటోలు

పొదలకూరు: పట్టణంలో ట్రాఫిక్ ఏ మాత్రం తగ్గడం లేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ఆటోలు ట్రాఫిక్‌కు కారణమవుతున్నాయి. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌లో ఆటోలు బస్సులకు అడ్డంగా నిలబెట్టడం వల్ల చిన్నాపాటి ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

నాలుగు మండలాల వాహనాలు పట్టణం మీదుగా జిల్లా కేంద్రం నెల్లూరు నగరానికి వెళ్లాల్సి ఉంది. ఫలితంగా ప్రతి నిత్యం పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికితోడు వ్యాపారులు కొందరు రోడ్‌మార్జిన్‌ను ఆక్రమించడంతో ప్రధాన రహదారి ఇరుకురోడ్డుగా మారి తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పట్టణం మీదుగా టిప్పర్లు, లారీలు వెళ్తుంటాయి. పెరుగుతున్న జనాభాతోపాటు ఇక్కడ ట్రాఫిక్ సమస్యలు జటిలం అవుతున్నాయి. రాపూరు, సైదాపురం, చేజర్ల, కలువాయి మండలాల నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, లారీలు, టిప్పర్లతోపాటు ఆటోల సంచారం ప్రధాన సమస్యగా మారింది. పంచాయతీ బస్టాండ్ పోలీసు అధికారుల పుణ్యమాని బాగుపడినా బస్టాండ్‌లోకి ఆటోలు వస్తూనే ఉన్నాయి. ఇక్కడి ట్రాఫిక్ సమస్యలు పోలీసులకు ప్రతినిత్యం తలనొప్పిగా మారింది. ఆటో డ్రైవర్లు ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేస్తుండడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని సందర్భాల్లో అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆటో స్టాండ్‌లు ఉన్నా గ్రామాల నుంచి వచ్చే డ్రైవర్లు రోడ్లపై నిలిపి ప్రయాణికులను ఎక్కించుకునే ప్రయత్నంలో ట్రాఫిక్ జామ్ అవుతోంది.

మొక్కలు నాటి.. ప్రతిజ్ఞ చేసి..



కోవూరు: జిలానీబాషాను సన్మానిస్తున్న దృశ్యం



పొదలకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న వైస్ ఎంపీపీ తదితరులు

పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామంలో శుక్రవారం నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి మొక్కలు నాటారు. ముందుగా ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసి మొక్కలు నాటాలని వైస్ ఎంపీపీ అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.నాగయ్య, సెక్రటరీ కిశోర్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తూరులో..

ఇందుకూరుపేట: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని కొత్తూరులో జెడ్పీ ఉన్నత పాఠశాలలో నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ప్రతిజ్ఞ చేసి మట్టికి వందనం కార్యక్రమం చేపట్టారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, భీమవరపు వెంకట కృష్ణారెడ్డి, వెంకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాళెంలో..

కొడవలూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మండలంలోని రామన్నపాళెంలో శుక్రవారం నా భూమి – నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భారతదేశాన్ని నిర్మించడంలో తమవంతు పాత్ర పోషిస్తామని, వలసవాద మనస్తత్వ జాడను తొలగిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకి ధనమ్మ, పంచాయతీ కార్యదర్శి డి.సురేష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కాకి శ్రీనివాసులు, పి.సాయిమోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పడుగుపాడులో..

కోవూరు: మండలంలోని పడుగుపాడులో శుక్రవారం నా భూమి – నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీలో 22 ఏళ్ల పనిచేసి పదవీ విరమణ చేసిన జిలానీబాషాను ఘనంగా సన్మానించారు. అనంతరం డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీలత, పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, సర్పంచ్ లక్ష్మీనారయణ, వీఆర్వోలు సుజాత, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: మొక్క నాటుతున్న దృశ్యం



కొడవలూరు మండలంలో..

రెండు వార్డులు ఏకగ్రీవం

ముత్తుకూరు: మండలంలోని రెండు పంచాయతీల్లో జరిగే ఉప ఎన్నికలకు సంబంధించి మొత్తం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి.

దువ్వూరువారిపాళెం ఆరో వార్డుకు ఒకటి, పోలంరాజుగుంట పంచాయతీలోని ఒకటో వార్డుకు ఒక నామినేషన్ దాఖలైంది. దీంతో ఈ రెండూ ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు శుక్రవారం ప్రకటించారు.

సున్నా వడ్డీ రూ.1.65 కోట్ల విడుదల

పొదలకూరు: సున్నా వడ్డీ 2022 – 23 సంవత్సరానికి సంబంధించిన నిధులు శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేశారు. 4వ విడతలో మండలంలోని పొదుపు సంఘాలకు రూ.1,65,86,366 నగదు విడుదలైనట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం రోజ్‌మేరీ తెలిపారు.